
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 21 వ భాగం

### హిరణ్యకశిపుడు, ప్రహ్లాద చరిత్ర – 3

శ్రీహరి చింతనం వదిలించడానికి మళ్ళీ ప్రహ్లాదుణ్ణి తీసుకెళ్ళారు కదా చండామార్కులు? మళ్ళీ అనేకసార్లు బుర్రంతా కడిగి అన్నీ చెప్పి తీసుకొచ్చారు.

క. భార్గవనందనుం డతనికి
మార్గము చెడకుండఁ బెక్కు మాఱులు నిచ్చల్
వర్గత్రితయము చెప్పె న
నర్గళ మగు మతివిశేషమమర నరేంద్రా! [7-156]

వ. మఱియు గురుండు శిష్యునకు సామదానభేదదండోపాయంబు లన్నియు నెఱింగించి నీతికోవిదుండయ్యె నని నమ్మి నిశ్చయించి తల్లికి నెఱింగించి తల్లిచేత నలంకృతుం డయిన కులదీపకు నవలోకించి. [7-157]

తీసుకెళ్ళేముందు మళ్ళీ సామ భేధ దండోపాయాలన్నీ చెప్పేరు – సరిగ్గా చెప్పకపోతే బెత్తం ఉండనే ఉంది మరి జాగ్రత్తా అని చూచాయగా చెప్తూ. వచ్చేముందు తల్లితో చెప్పి రాజుగారి దగ్గిరకి కదా వెళ్తున్నాడు అని మంచి బట్టలూ నగలూ పెట్టి తీసుకెళ్ళేరు. సభలో ప్రవేశించే ముందు హెచ్చరిస్తున్నారు ఇంకోసారి.

ఉ. త్రిప్పకు మన్న మా మతము, దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకు మన్న, నేఁడు మన దైత్యవరేణ్యుని మ్రోల నేము మున్
చెప్పినరీతి గాని మఱి చెప్పకు మన్న విరోధిశాస్త్రముల్,
విప్పకుమన్న దుష్టమగు విష్ణుచరిత్రకథార్థజాలముల్. [7-158]

ఒరే నాయనా మా కొంపలు ముంచకు, మేమేం చెప్పామో అవే చెప్పు, నీకు వేరైనా ఏవైనా తెల్సి ఉంటే అవి మాత్రం మాట్లాడకు బాబూ, మా ఉద్యోగాలు పోతాయిరా నాయనా అని వేడుకుంటున్నారు. వేరే ఎదైనా అంటే, "దుష్టమగు విష్ణుచరిత్ర కథార్థజాలముల్" అని. దేవతలకి రాక్షసులెంత శత్రువులో రాక్షసులకి దేవతలు కూడా అంత దుష్టులే కదా? అందుకే ఇక్కడ విష్ణు చరిత దుష్టమైపోయింది. ఇవన్నీ వినేవాడైతే ప్రహ్లాదుడౌతాడా?

ఇప్పుడు వీణ్ణి తీసుకెళ్ళి మహారాజుగారి దగ్గిర చూపించి చెప్తున్నారు. ఇదిగోనండి మీ అబ్బాయి గారు. బాగా శిక్షించాము, మళ్ళీ అన్నీ బుర్రలోకి ఎక్కించాము. మేము నేర్పిన విద్యా బలం అంతా పరీక్షించుకోండి అని.

క. శిక్షించితి మన్యము లగు
పక్షంబులు మాని నీతిపారగుఁ డయ్యెన్
రక్షోవంశాధీశ్వర!
వీక్షింపుము; నీ కుమారు విద్యాబలమున్. [7-161]

వ. అని పలికిన శుక్రకుమారకు వచనంబు లాకర్ణించి దానవేంద్రుండు దనకు దండప్రణామంబుచేసి నిలుచున్న కొడుకును దీవించి బాహుదండంబులు చాచి దిగ్గనన్ డగ్గఱ దిగిచి గాఢాలింగనంబు చేసి తన తొడలమీఁద నిడుకొని చుంచు దువ్వి చిబుకంబుఁ బుడికి చెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రేమాతిరేక సంజనిత బాష్పసలిల బిందుసందోహంబుల నతని వదనారవిందంబుఁ దడుపుచు మందమధురాలాపంబుల ని ట్లనియె. [7-162]

శా. చోద్యంబయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు చెప్పిరో? గురువు లేవెంటం బఠింపించిరో?
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా. [7-163]

సంతోషంగా కొడుకుని దగ్గిరకి తీసుకుని తొడమీద కూర్చోబెట్టుకున్నాడు. బావుందిరా అబ్బాయ్ ఇంతకాలానికి మళ్ళీ కనిపించావ్, ఏమేం చెప్పారు నీకు, ఏం నేర్చుకున్నావ్ అవన్నీ వద్దు కానీ ఓ చిన్న పద్యమో ఏదో ఒకటి చెప్పు నాకు అన్నాడు. ఎంతైనా కొడుకే కదా ప్రేమ ఉంది కానీ విష్ణు భక్తి ఉండకూడదనే ఈ తతంగం అంతా.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్య శాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ! [7-166]

ఇప్పుడు కుర్రాడు చెప్తున్నాడు – గురువులు చెప్పమన్నట్టే – గురువులు నన్ను చదివించారు. ధర్మశాస్త్రాలు అవీను. చదుల్లో ఉన్న మర్మం అంతా చదివేను తండ్రీ అన్నాడు. అక్కడ ఊరుకుంటే బాగుండేది కదా? ఊరుకుంటే హిరణ్యకశిపుడికి రాక్షసత్వం ఎలా పోతుంది? అందుకే ఇంకో ప్రయత్నం చేస్తున్నాడు శ్రీహరి.

మ. తనుహృద్భాషలసఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతున్ సత్యంబు దైత్యోత్తమా! [7-167]

ఉన్న తొమ్మిది భక్తిమార్గాలలోనూ శ్రీహరి స్మరణ వదలకూడదని తెల్సుకున్నాను. అదే జీవితంలో మంచిది అని తెల్సుకున్నాను తండ్రీ. అంతే కాదు,

శా. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థసంసారముల్. [7-168]

హరిభక్తి లేకపోతే జీవితం ఎలాంటిదంటే, గుడ్డివారికి సూర్యోదయం చూపించడం, చెవిటివాడికి శంఖం వినిపించడం, మూర్ఖుడికి సద్గ్రంధం చదవడం లాంటివి. ఇదంతా వ్యర్థ ప్రయత్నం కదా? ఈ సరికి రాజుగారి కనుబొమలు ముడిపడడం, మొహం ఎర్రబడడం, మనకి కనిపిస్తుంది. ఏమిటీ? అనుకునేలోపుల మళ్ళీ చెప్తున్నాడు

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు;
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ;
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు;
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము;
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు;
మధువైరిఁ దవిలిన మనము మనము;
భగవంతు వలగొను పదములు పదములు;
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి; [7-169]

తే. దేవదేవుని చింతించు దినము దినము;
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు;
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు;
తండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి. [7-169.1]

శ్రీహరి ని సేవించే చేతులే చేతులు. చూసే కళ్ళు మాత్రమే కళ్ళు. ఇలా మన శరీరంలో ప్రతీ అవయవం కూడా శ్రీహరిని పూజించడానికే వాడాలి తండ్రీ అంటున్నాడు ప్రహ్లాదుడు. అంబరీషోపాఖ్యానంలో 'హరియని సంభావించును..." "చిత్తంబు మధురిపు శ్రీపాదముల యంద ---" అనే పద్యాలు దీనికి సరిపోయినట్టుగా అనిపించిందా? అదే పోతన గొప్పదనం. ఒకే భావాన్ని అనేక రీతుల్లో "హరి" అనే పదాన్ని అనేక రకాలుగా వాడి చూపించగలడు. అందుకే పోతన కవితాకళ ప్రయోగించడంలో అక్షయ సమ్మోహనాస్త్రతూణీరుడు. అది చులాగ్గా, ఏవో రెండు మూడు పద్యాలు రాయగానే వచ్చేది కాదు. పోతన భాగవతంలో ఎక్కడికక్కడ ఇలాగే "పలికించెడు వాడు రామభద్రుండట .. " అనేది మనకి అవగతం అవుతూఉంటుంది చదువుతూంటే.

ఈసరికి హిరణ్యకశిపుడికి కోపం ఉగ్రస్థాయిలో నషాళం అంటుకుంది. కుర్రాణ్ణి ఒళ్ళోంచి కిందకి దించి గురువులమీద చూపిస్తున్నాడు ఆ కోపం. కుర్రాడి మీదే ఎందుకు చూపించలేదంటే, ముందు చెప్పాడుగా, "ఎట్టాడిన అట్టాడుదు.." అని ? ఇంకా చిన్న కుర్రాడే కదా, వీడి తప్పు లేదు, ఈ గురువులే వీణ్ణి ఇలా తయారుచేస్తున్నారనే అనుకుంటున్నాడు ఇంకా.

చ. పటుతరనీతిశాస్త్రచయ పారగుఁ జేసెద నంచు బాలు నీ
వటు గొనిపోయి వానికి ననర్థము లైన విరోధిశాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృగుప్రవరుండ వటంచు నమ్మితిన్
కటకట! బ్రాహ్మణాకృతివి గాక యథార్థపు బ్రాహ్మణుండవే? [7-173]

వీణ్ణి తీసుకెళ్ళి నీతిశాస్త్రాలన్నీ నేర్పుతానని చెప్పి ఇదా మీరు చేసేపని? నువ్వేదో భృగు వంశం వాడివనీ బ్రాహ్మణుడివనీ నమ్మాను నేను. ఇదా మీరు చేసే నిర్వాకం? అని గద్దించేటప్పటికి వాళ్ళు వణికిపోయి సమాధానం చెప్తున్నారు.

ఉ. తప్పులు లేవు మావలన దానవనాథ! విరోధిశాస్త్రముల్
చెప్పము క్రూరులై పరులు చెప్పరు మీ చరణంబులాన సు
మ్మెప్పుడు మీ కుమారునకు నింతయు నైజమనీష యెవ్వరుం
జెప్పెడిపాటి గాదు ప్రతిచింతఁ దలంపుము నేర్పుకైవడిన్. [7-176]

క. మిత్రులము పురోహితులము
పాత్రుల మే మదియుఁ గాక భార్గవులము నీ
పుత్రుని నిటువలెఁ జేయఁగ
శత్రులమే దైత్యజలధిచంద్రమ! వింటే. [7-177]

ఓ సారి ఆలోచించండి మహారాజా, మేము ఇలా ఎప్పుడైనా చేసామా ముందు? మేమెందుకు చెప్తాం ఇవన్నీ? ఇవన్నీ మేము చెప్పినవి కాదు. మీవాడికి ఇవి బుర్రలో ఎలా వచ్చాయో పరమేశ్వరుడికెరుక. మేము మీ పురోహితులం, హితులమూను, శతృవులం కాదు కదా? ఇలా అనేసరికి ప్రహ్లాదుడు చెప్తున్నాడు గురువుల తప్పులేదు నాన్నా, అని వాళ్ళని వెనకేసుకొస్తూ.

ఉ. అచ్చపుఁ జీకటిం బడి గృహవ్రతులైన విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణు లైనవారికిం
జెచ్చరఁ బుట్టునే పరులు చెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గానలకు నేఁగిన నైన హరిప్రబోధముల్. [7-181]

భవసాగరంలో ఈదుతూ, అచ్చపు చీకటిలో అనేకానేక జన్మలెత్తుతూ పుట్టి చచ్చిపోయేవాళ్లకి ఈ హరి గురించి ఒకళ్ళు చెప్తే మాత్రం ఎలా తెలుస్తుంది? భక్తి అనేది ఒకసారి కలిగేది కాదు కదా? ఆయన కరుణ ఉన్నప్పుడు మాత్రం అది నిరాటంకంగా ప్రవహిస్తూ ఉంటుంది. అందుచేత వీళ్ల తప్పు లేదు అంటున్నాడు ప్రహ్లాదుడు.

శా. క్రోడంబై పినతండ్రిఁ జంపె నని తాఁ గ్రోధించి చిత్తంబులో
వీడం జేయఁడు బంటుభంగి హరికిన్ విద్వేషికిన్ భక్తుఁడై
యోడం దక్కట! ప్రాణవాయువులు వీఁ డొప్పించుచున్నాఁడు నా
తోడన్ వైరముపట్టె నిట్టి జనకద్రోహిన్ మహిం గంటిరే. [7-185]

ఇలా అనేసరికి హిరణ్యకశిపుడికి కోపం ఎక్కువై చెప్తున్నాడు. పినతండ్రి హిరణ్యాక్షుణ్ణి చంపాడని తెలిసీ వేలంతలేని వీడు శ్రీహరి శ్రీహరి అంటూ నా ప్రాణాలు తీస్తున్నాడు. నేను సొంత తండ్రినని తెలిసీ ఇలాచేసే కొడుకుల్ని ఈ ప్రపంచంలో ఎక్కడైనా చూసారా? ఇంకవీడు బతకడం అనవసరం.

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్ష చేయుక్రియ నీ యజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదం గులము నిర్దోషంబు గావించెదన్. [7-188]

శరీరంలో ఏదైనా ఒక అవయవం కుళ్ళిపోతే దాన్ని తీసేసి ప్రాణాన్ని రక్షించే విధంగా కుల ద్రోహీ, కేశవ పక్షపాతీ అయిన వీణ్ణి చంపించి రాక్షస కులానికి శతృవులు లేకుండా (నిర్దోషంబు గావించెదన్) చేస్తాను చూడండి.

క. హంతవ్యుఁడు రక్షింపను
మంతవ్యుఁడు గాడు యముని మందిరమునకున్
గంతవ్యుఁడు వధమున కుప
రంతవ్యుం డనక చంపి రం డీ పడుచున్. [7-189]

ఏ విధంగా చూసినా చంపదగినవాడే. పోయి వీణ్ణి తీసుకెళ్ళి చంపేసి రండిరా అన్నాడు.

మొట్టమొదట్లో యుధిష్టురుడు నారదుణ్ణి "ఎంత చెడ్డవాడైనా కొడుకుని చంపేసి రమ్మని చెప్పే తండ్రి ఉంటాడా?" అని అడిగాడనీ చెప్పుకున్నాం. దానికోసం ఈ కథంతా చెప్పేడన్న మాట. ఎందుకంత కోపం హిరణ్యకశిపుడికి? అన్నివేల సంవత్సరాలు చేసిన తపస్సు వ్యర్థం అయిపోతోంది అయిదేళ్ళ కుర్రాడి ముందు. అంటే తాను సంపాదించినది – పుణ్యం కానీయండి, డబ్బులు కానీయండి, మరోటి కానీయండి – పోతోంది. వాటిని అంటిపెట్టుకున్నందుకే ఈ కోపం అంతాను. నేను ఇప్పుడు రారాజుని అనే అహంకారం సంగతి సరే, ఈ మమకారం వల్లే కోపం అంతాను.

భగవద్గీతలో శ్లోకం ఇదే చెప్తోంది చూడండి.

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూ పజాయతే
సంగాస్తం జాయతే కామః కామాత్ క్రోధోభిజాయతే
క్రోదాద్భవతి సమ్మోహః సమ్మోహా స్మృతివిభ్రమః
స్మృతిభ్రంసా బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణస్యతి [భగవద్గీత 2.62, 63]

విష్ణువుని జయించాలనే తీవ్రమైన కోరికా (కామం) ఆ కోరిక తీరకపోవడం వల్ల కోపం, ఆ కోపం వల్ల సమ్మోహం, సమ్మోహం వల్ల మంచి చెడూ తెలియకపోవడం, దానివల్ల బుద్ధి నాశనం, బుద్ధి నాశనం వల్ల అధోగతి (మృత్యువు).

ఇక్కడిదాకా హిరణ్యకశిపుడు కొడుకుని మమూలుగా చూసాడు. ఇప్పుడు శతృవులా చూడ్డం మొదలుపెట్టి శిక్షించడం మొదలుపెట్టేడు. వచ్చే వ్యాసం నుంచీ చావుకాలం సమీపించిన హిరణ్యకశిపుడి ఆలోచనలూ, అవన్నీ ఓర్చుకున్న ప్రహ్లాదుడి సంగతీ చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS